రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలన


రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలను తెలసుకుంటున్న మనోజ్ జోషి

శంషాబాద్: భూముల రిజిస్ట్రేషన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సులభతరం చేసేందుకు శనివారం శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ విధానాలను పరిశీలించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆన్‌లైన్‌తో పాటు మరికొంత ప్రక్రియ ఆఫ్‌లైన్‌లో జరుగుతున్న తీరును భూవనరుల విభాగం కార్యదర్శి మనోజ్‌జోషి, సంయుక్తకార్యదర్శి కునాల్ అడిగి తెలుసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్ ద్వారా జరుగుతున్న వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు పరిశీలించారు. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం భూముల రిజిస్ట్రేషన్ పూర్తి ఆన్‌లైన్ ప్రక్రియలో జరుగుతుండగా.. అన్ని రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను అమలు చేసేందుకు పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర అధికారుల బృందానికి రాష్ట్ర రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ శశాంక పలు వివరాలను వెల్లడించారు. జిల్లా రిజిస్ట్రార్ సంతోష్, శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ విఫలం


మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గత ఆరు నెలలుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమైందని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. శనివారం కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవులపల్లి అశోక్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన వారికి పథకాలను అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. కాలనీలు, బస్తీల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. నవారు మురళీధర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సీహెచ్. వెంకటరమణ, సంతోష్‌గౌడ్, నరసింహ్మా, చిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, కె.బాబు, గోపాల్‌నాయక్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై అవగాహన సదస్సు


కలుపు నివారణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ

ఏజీవర్సిటీ: కలుపు నివారణ వారోత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాలలో కలుపు నిర్మూలన (పార్థీనియం)పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో కలుపు నిర్మూలన ప్రాముఖ్యత, పంటలకు జరిగే నష్టాలు వ్యాప్తి చెందే విధానం, పార్థీనియం (కలుపు) నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. కలుపు నియంత్రించడానికి పాటించే వివిధ యాజమాన్య పద్ధతులు, జీవ నియంత్రణ రసాయనిక పద్ధతులు మొదలైన వాటి గురించి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పద్మజ వివరించారు. ఈ కలుపు పంటలకే కాకుండా మనుషులు, పశువుల ఆరోగ్యానికి కూడా హానికరం అని ఆమె వివరించారు. కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ యాకాద్రి, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం అధికారులు డాక్టర్ శ్రీలత, రంజిత, అరుణ, ప్రశాంత పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అత్తాపూర్: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ కాలనీ స్థానిక ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేసేవారిని గుర్తించి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిల్వ ఉంచిన రేషన్ బియ్యం, లైసెన్స్‌లు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డీసీపీ మాట్లాడుతూ.. అర్ధరాత్రి దాటాక ఎవరికి వారు గుంపులుగా చేరి ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదని, యువకులు వ్యసనాలకు బానిసగా మారుతూ.. తల్లిదండ్రులకు భారం కాకుండా వారికి సహకరించాలని కోరారు. యువకుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఈ విషయంలో ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ప్రజలు సరైన సమయంలో సమాచారం ఇవ్వాలని సూచించారు.

దోమలు వృద్ధి చెందకుండా 'లార్వైసైడ్ స్ప్రే'


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా లార్విసైడ్ స్ప్రే చేసే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. 18వ డివిజన్‌లోని సరస్వతీ విద్యాపీఠం పాఠశాల ఎదురుగా ఉన్న నీటి గుంతలు, దాత్రి రోడ్డులో తదితర ప్రాంతాల్లో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా 50 శాతం టేమిఫస్‌ను 10 లీటర్ల నీటిలో 2.5 ఎం.ఎల్ కలిపి స్ప్రే చేయించారు. దీన్ని వల్ల డెంగీ, మలేరియా దోమలు లార్వాలు వృద్ధి చెందకుండా నివారించవచ్చన్నారు. 11వ డివిజన్‌లోని ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులోని వర్షపు నీటి కాలువల్లో బ్లీచింగ్, శానిటేషన్ పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సురేష్, యాదగిరి, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బక్షికుంట చెరువు పునరుద్ధరణ ఓ మైలురాయి

- పర్యావరణ సుస్థిరత్వంలో ఫెనోమ్ కొత్త ప్రమాణాలను నెలకొల్పింది
- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ



హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని బక్షికుంట చెరువు పునరుద్ధరణ మైలురాయిగా నిలించిందని, ఫెనోమ్ పర్యావరణ సుస్థిరత్వంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిందని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. శనివారం బక్షికుంట చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయిన నేపథ్యంలో లేక్స్ కమిషనర్ శివకుమార్ నాయుడు కిల్లు, ఫెనోమ్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ మహే బైరెడ్డి, ఫెనోమ్ సీఓఓ హరి బైరెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఆనంద్ మల్లిగవాడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్షికుంట చెరువు ప్రాజెక్టు కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి నమూనా అవుతుందన్నారు. చెరువులను కాపాడడంతో పాటు సుందరీకరణలో భాగస్వామ్యం అవసరమన్నారు. బైరెడ్డి ఫౌండేషన్ సంస్థ మరిన్ని చెరువులను పునరుద్ధరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 180 చెరువులు ఉండగా శేరిలింగంపల్లిలో 70 చెరువులు ఉన్నాయన్నారు. 40 చెరువులు అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. అనంతరం బైరెడ్డి ఫౌండేషన్ సంస్థ, ఫెనోమ్ కేర్ ప్రతినిధులు మాట్లాడుతూ పర్యావరణ రక్షణలో భాగస్వాములవడం గర్వంగా ఉందన్నారు. బక్షికుంట చెరువు చుట్టుపక్క ల లక్ష మంది జనాభాకు ముఖ్యమైన నీటి వనరుగా ఉందన్నారు. చెరువు కట్టపై చిన్నారులకు ఆటస్థలం కూడా ఏర్పాటు చేశామన్నారు.

చదువు సమాజానికి ఉపయోగపడాలి

సుబ్రమణియన్ రామదొరై


శారదాధామంలో సుబ్రమణియన్ రామదొరైని సన్మానిస్తున్న దృశ్యం


విద్యార్థులు రచించిన పుస్తకాన్ని చదివి అభినందిస్తూ..

బండ్లగూడ: విద్యార్థుల చదువు, వికాసం దేశాభివృద్ధి, సమాజానికి ఉపయోగపడాలని పద్మభూషన్ అవార్డు గ్రహీత, భారత ప్రభుత్వ ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన సలహాదారులు సుబ్రమణియన్ రామదొరై అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలోని శ్రీ విద్యారణ ఆవాస విద్యాలయం, శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుండే నైపుణ్యాలను అలవర్చుకుని, నైపుణ్య శక్తిని పెంచుకునే ఆలోచన చేయాలన్నారు. చిన్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు దారి తీస్తాయన్నారు. ఒకప్పుడు తీగల ద్వారా టెలిఫోన్ ఉండేదని, ప్రస్తుతం ఆ టెలిఫోన్ నూతనత్వం ఈనాడు మనం చూస్తున్న సెల్‌ఫోన్ అన్నారు. మనం ఏదైనా అత్యవసర సమయంలో మోర్స్ కోడ్ సిగ్నల్స్ ద్వారా వార్తలు పంపేవారు. ప్రస్తుతం మన అరచేతిలోకి ఇంటర్నెట్ సౌకర్యం వచ్చిందన్నారు. మన చేతిలోనే స్మార్ట్ ఫోన్ ద్వారా ప్రపంచాన్ని మొత్తం చూస్తున్నామన్నారు. కొద్దిగా ఆలోచనలతో పదును పెడితే దానిలో దాగిఉన్న నూతనత్వం బయటికి వస్తుందని చెప్పారు. మన చదువు, వికాసం మన దేశాభివృద్ధికి, మన సమాజానికి ఉపయోగపడాలన్నారు. శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి చిరంజీవి బొడ్డు కృష్ణ, వంశిక రచించిన పుస్తకాన్ని చదివి వారిని అభినందించారు. క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారా సమాజంలో నైతిక విలువలు అందిస్తున్నందుకు పాఠశాల యాజమాన్యాన్ని ఈ సందర్భంగా కొనియాడారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్‌రావు, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కోశాధికారి మల్లయ్య, శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, ఆవాస విద్యాలయం అధ్యక్షుడు గోకరి అర్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతికి వీడ్కోలు


ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలుకుతున్న మంత్రి పొన్నం, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

శంషాబాద్: రాష్ట్ర పర్యటన ముగించుకుని ఢిల్లీ బయల్దేరిన ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పుష్పగుచ్ఛాలు అందజేసి వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలీసులతో రాఖీ


పోలీస్‌స్టేషన్‌లో రాఖీలు కట్టిన విద్యార్థినులు

మణికొండ: రాఖీ పండగను పురస్కరించుకుని మణికొండలోని త్రివేణి పాఠశాల విద్యార్థినులు పలువురికి రాఖీలు కట్టి ఆశీర్వచనాలు తీసుకున్నారు. శనివారం మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైలు, సిబ్బందికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రాఖీల పండగ సోదరులు, సోదరిల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధాన్ని తెలుపుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను ఇప్పటి నుంచే తెలుసుకోవాలన్నారు. ఎస్సైలు సతీష్, సుఖేందర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ వీరేంద్రచౌదరి, డాక్టర్ నట్రాజ్, సీఆర్‌ఓ సాయి నర్సింహారావు, ఏసీఆర్ నరేష్, ప్రిన్సిపాల్ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావు ఆఫీస్‌పై దాడి సరికాదు


పోరెడ్డి ధర్మారెడ్డి

రాజేంద్రనగర్: మాజీ మంత్రి హరీష్‌రావు క్యాంపు ఆఫీస్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నామని బీఆర్‌ఎస్ రాజేంద్రనగర్ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి అన్నారు. మాజీ మంత్రి, సీనియర్ సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీష్‌రావు అధికారిక నివాసంపై అర్ధరాత్రి దాడిచేసి తాళాలు పగలగొట్టి ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. గత పదేళ్లలో ఇలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని, ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకే ఇలా జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ ఘటనపై డీజీపీ తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

19న హెచ్‌సీయూలో గోల్డెన్ జూబ్లీ లెక్చర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గోల్డెన్ జూబ్లీ విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ ఉదయం 11.30 గంటలకు సీవి రామన్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఇందులో 'హ్యూమన్ క్యాపిటల్ ఇన్ ఇండియా: లెన్సెస్ ఓల్డ్ అండ్ న్యూ' అనే అంశంపై ఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎకనామిక్స్ అండ్ ప్లానింగ్ యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ అభిరూప్‌ముఖోపాధ్యాయ ఉపన్యసిస్తారు.

20న టీహబ్‌లో ప్రత్యేక సమావేశం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఈనెల 20వ తేదీ 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సౌత్ ఏషియన్ విమెన్ ఇన్ టెక్ (ఎస్‌ఏడబ్ల్యూఐటీ), టీహబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాయి. ఈ కార్యక్రమంలో 'ప్రాక్టికల్ ఇన్‌సైట్స్ ఇన్‌టూ డిప్లాయింగ్ జనరేటివ్ ఏఐ మోడల్స్' అనే అంశంపై జరిగే సమావేశంలో తెలంగాణ సీఐఐ ఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ విద్యా రెడ్డి, టీహబ్ సీఈఓ శ్రీనివాసరావు, ఫిక్కీ ఎఫ్‌ఎల్‌ఓ చైర్‌పర్సన్ ప్రియా గజ్దార్,యూఎస్ కాన్సులేట్ పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్లరాన్, వీహబ్ సీఈఓ సీత పాల్గొంటారు.

నియామకం


గంజి రఘునాథ్

గోల్కొండ: కార్వాన్ పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడిగా గంజి రఘునాథ్ నియామకమయ్యారు. శనివారం కార్వాన్‌లో జరిగిన సంఘం సమావేశంలో కుల పెద్ద కె.పాండయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఉత్తరపల్లి దయానంద్, ఉపాధ్యక్షుడిగా జే జితేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారని సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న విద్యార్థులు

శంషాబాద్: మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు విద్యార్థులతో శంషాబాద్ పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై ప్రణయ్‌లు మాట్లాడుతూ.. ఈ దారుణ ఘటనలో బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. అత్యాచారంపై ప్రభుత్వ వైద్యులు ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి ప్రభుత్వాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంధ్య, తరుణ్, తనిష్క, అర్జున్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు మణికంఠ, అభిషేక్, వర్ధన్, జగదీష్, అజయ్‌లు పాల్గొన్నారు.

ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఎమ్మెల్యే గాంధీ



అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించాలని రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్, ఐటీ మంత్రి శ్రీధర్ బాబును ఎమ్మెల్యే గాంధీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చెరువులు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ, సీసీరోడ్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తానని, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాలను ఆపండి !


కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బీఆర్‌ఎస్ నేతలు

మణికొండ: మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, దోపిడీలను నిలువరించకుండా ఎమ్మెల్యే కేటీఆర్‌పై మహిళా కమిషనర్ నోటీసు జారీ చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డి.సీతారాం, మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డిలు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నేతలు కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసినందుకు నిరసనగా వారు శనివారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు సరిపడ సీట్ల పెంపుతో పాటు బస్సులను పెంచాలని ప్రతిపక్ష పార్టీగా కోరినా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు కార్యాలయంపై కూడా దాడికి దిగారన్నారు. ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులు విజయలక్ష్మి, లతాగౌడ్, లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, శ్రీనాథ్‌గౌడ్, ఎస్. శ్రీకాంత్, ఆరీఫ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, కిరణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'జీరో మస్కిటోస్- జీరో డెంగీ' పై అవగాహన

నాంపల్లి: జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో 'వలంటీర్ హీరోస్' కార్యక్రమంలో భాగంగా రెడ్‌హిల్స్ డివిజన్‌లో దోమల నియంత్రణకు 'జీరో మస్కిటోస్- జీరో డెంగీ' అనే అంశంపై శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శిశు సదన్ హైస్కూల్ విద్యార్థులు వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. మస్కిటో ఫాగింగ్ ఏఈ లక్ష్మీదాసుపల్లి, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ మహ్మద్ నూరుల్లా ఖాన్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా శ్రీధర్



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఖాదర్‌ను కొత్తగూడెంకు బదిలీచేయడంతో వికారాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఇంటి యజమానులు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అక్రమ నిర్మాణాలను సహించేది లేదని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి


విద్యార్థులకు బ్యాగులను అందజేసిన చైర్‌పర్సన్

మణికొండ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఐటీ సంస్థలు, సేవా సంస్థలు ఆదుకోవాల్సిన అవసరం ఉందని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం 'సత్య సుందర హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులను అందజేశారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ శివారెడ్డి, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లితండా సమస్యలు పరిష్కరిస్తా

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తండాలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తండాలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్‌లైన్ పనులను, రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అంతకు ముందు స్థానికులు మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా చూడాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఈఈ దుర్గాప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు శేఖర్, రమేష్, రాజు, నర్సింహ, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

జీఐఎస్ ఇంటింటి సర్వే పరిశీలన

హఫీజ్‌పేట్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) ఇంటి ఆస్తుల సర్వేను శనివారం చందానగర్ డివిజన్ పరిధిలోని గౌతమీనగర్‌లో జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, చందానగర్ సర్కిల్ 21 ఇంచార్జి ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, సర్కిల్ 21 ఏఎంసీ కృష్ణ, జీఐఎస్ సర్వే అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికుల నుంచి సర్వే విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సర్వే పట్టణ నిర్వహణ మెరుగుపర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని సర్వేయర్లు అడిగిన పత్రాలను అందజేయాలని కోరారు. ఇంటి ఆస్తి పన్ను పత్రం, కరెంటు బిల్లు, మంచినీటి బిల్లు ఇవ్వాలన్నారు. ఈ పరిశీలనలో జీహెచ్‌ఎంసీ అధికారులు, చందానగర్ ఏఎంసీ విజయ్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అల్ హాజరీ అన్నారు. నియోజకవర్గానికి చెందిన నాయకులతో శనివారం కుల్సుంపురాలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం హామీలను దశలవారీగా అమలు చేస్తున్నాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని ఆయనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కురాకుల కృష్ణ, చంటిబాబు, రఘుపాల్‌రెడ్డి, శ్రీనివాస్, వేణుగౌడ్, కిషన్, అబీబ్, అమీద్ తదితరులు ఉన్నారు.

మజ్లిస్‌లో యువతకు ప్రాధాన్యం

గోల్కొండ: మజ్లిస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ అన్నారు. టోలిచౌకీ టూమ్స్ రోడ్ చౌరస్తాలోని రాయల్ టింబర్స్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ సెక్యూలర్ విధానాలను నమ్ముతూ ముందుకు సాగుతుందన్నారు. పేద, బలహీన వర్గాల వారికి మెరుగైన విద్యను పార్టీ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహ్మద్ నసీరుద్దీన్, హుసేనా పాషా, నవాజ్, సాహిల్, నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్జమాతో పాటు రాయల్ టింబర్స్ మెనేజింగ్ డైరెక్టర్ ఆసిఫ్, తెలంగాణ ఫ్యామిలీ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులు ఉన్నారు.

ఆపరేషన్ ధూల్‌పేట్‌పై సమీక్ష

గన్‌ఫౌండ్రీ: పోలీసుల దాడులతో ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయదారులు పరారయ్యారని ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ ఖురేషి అన్నారు. ధూల్‌పేట్ కార్యాలయంలో ఎక్సైజ్, పోలీసులు ఉన్నతాధికారులతో ధూల్‌పేట్ ఆపరేషన్‌పై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధూల్‌పేట్‌లో ప్రధాన నిందితుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని మిగిలినవారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు. ఈ నెల చివరిలోగా దాడులు నిర్వహించి ధూల్‌పేట్‌లో గంజాయి లేకుండా చూసేలా పనిచేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, భాస్కర్, తులా శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి, సీఐలు మధుబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రశాంతంగా నిర్వహించాలి

డబీర్‌పురా: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా 40వ రోజు సందర్భంగా అర్బయిన్ ర్యాలీని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా సూచించారు. ఈ నెల 20వ తేదీన ర్యాలీ సందర్భంగా శనివారం దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో ఆమె ఖిబ్లాస్, అంజుమన్‌ల ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలను పెద్దలకు సూచించారు. ర్యాలీ సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230